క్లుప్తంగా

ఘనంగాబంగారమ్మ తల్లి పండగ


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు గొల్లవిల్లివానిపాలెంలో బంగారమ్మతల్లి పండగ గురువారం ఘనంగా జరిగింది. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్తులు అమ్మవారికి పసుపుకుంకుమలు, చీరలు సమర్పించి మొక్కుతీర్చుకున్నారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వాసు, సంతోష్, దేముడు బాబు పాల్గొన్నారు.

రేపు సిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం


నాయుడుపాలెంలో కొలువుదీరిన సిద్ధి వినాయకుడు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెంలో కొలువైన సిద్ధి వినాయక ఆలయ 5వ వార్షికోత్సవాన్ని ఈనెల 6న వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ ప్రతినిధి కూండ్రపు మధు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 7 నుంచి ఆలయంలో వేద పండితులతో గణపతి హోమం, అభిషేక పూజలు జరుగుతాయని చెప్పారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామని తెలిపారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని ఉత్సవ కమిటీ ప్రతినిధి మధు కోరారు.

మహిళ అదృశ్యం


వెంకటలక్ష్మి

సింహాచలం: మహిళ అదృశ్యంపై పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ అప్పారావు తెలిపిన వివరాలు.. లక్ష్మీపురానికి చెందిన ఒప్పంగి వెంకటలక్ష్మి(35) ఈనెల 2వతేదీన సాయంత్రం 4గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకి వెళ్లి తిరిగిరాలేదు. వెంకటలక్ష్మి భర్త ఒప్పంగి సూర్యనారాయణ, కుటుంబ సభ్యులు వెతికారు. ఆమె జాడ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ ప్రకాష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి సుబ్రహ్మణ్యస్వామికి పౌర్ణమి పూజలు


సుబ్రహ్మణ్య స్వామి

కంచరపాలెం: వైశాఖ పౌర్ణిమను పురస్కరించుకుని ఈ నెల 5 నుంచి 7 వరకు ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవాల రాజు కృష్ణ తెలిపారు. ఆలయంలో గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. శుక్రవారం ఉదయం కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ, మండపారాధన, ముత్తయిదువుల చేతుల మీదుగా ఊంజల్ సేవ జరుగుతాయని చెప్పారు. అనంతరం స్వామికి క్షీర, పంచామృతాభిషేకాలు, స్కందవేద హోమం తదితర పూజలు చేస్తామన్నారు. 6న సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు, 7న ఆదివారం మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం, సాయంత్రం స్వామి తిరువీధి మహోత్సవం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించామని చెప్పారు. కార్యక్రమంలో కాండ్రేగుల రాము, సిహెచ్.కుమారి, కె.రవి, సిహెచ్.సురేష్ శర్మ పాల్గొన్నారు.

పునాదులు కోతకు గురికాకుండా చర్యలు


వర్షానికి కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసరావు తదితరులు


లే అవుట్‌లో చురుగ్గా సాగుతున్న గృహ నిర్మాణాలు

- గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసరావు
- వీఎంఆర్‌డీఏ అధికారులతో కలిసి పైడివాడ లే అవుట్ సందర్శన

సబ్బవరం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మెగా లే అవుట్‌లోని పునాదులు, స్థలాలు కోతకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని పైడివాడ అగ్రహారంలో ఏర్పాటు చేసిన లే అవుట్‌ను గురువారం ఇరిగేషన్ , వీఎంఆర్‌డీఏ, గృహ నిర్మాణ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు స్థలాలు కోతకుగురవుతున్నాయని వార్తలు రావడంతో విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున లే అవుట్‌ను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. సమగ్రంగా నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

డ్రైన్లు ఏర్పాటు

వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా,నిర్మాణాలు కోతకు గురికాకుండా డ్రైన్లు ఏర్పాటు చేయనున్నట్లు పీడీ తెలిపారు. ప్రస్తుతం నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ తరలించేందుకు రోడ్లు ఏర్పాటు చేయడంతో కొంత గెడ్డవాగు దిబ్బతినే అవకాశం ఉందన్నారు. దీనికి అడ్డుకట్ట వేయడానికి రోడ్లకు ఇరువైపులా డ్రైన్లు ఏర్పాటు చేయడం ద్వారా సమస్యను పూర్తిగా పరిష్కరించవచ్చన్నారు. ఈ డ్రైన్లు ఏర్పాటు చేసే సమయంలో వచ్చే గ్రావెల్‌ను నిర్మాణంలో ఉన్న బేస్‌మెంట్‌ల ఫిల్లింగ్ చేసేందుకు ఉపయోగించనున్నట్టు తెలిపారు. అదే విధంగా లే అవుట్‌ను ఆనుకుని ఉన్న కొండ నుంచి వచ్చే వరదనీటిని నియంత్రించేందుకు కొండ చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. మిగులు నీరు కింద ఉండే చెరువుకు తరలించేవిధంగా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

చురుగ్గా నిర్మాణాలు

పైడివాడ అగ్రహారం లే అవుట్‌లో ఆప్షన్–3 ఎంచుకున్న లబ్ధిదారుల కోసం ప్రభుత్వమే గృహ నిర్మాణాలు చేపట్టింది. గృహ నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. లే అవుట్‌లో కోతకు గురైన బేస్‌మెంట్‌లను పరిశీలించినవారిలో సర్పంచ్ వద్దాది అప్పలరాజు, వీఎంఆర్‌డీఏ ఈఈ ప్రసంగరాజు,అధికారులు శివప్రసాద్, బలరాం రాజు, రాంబాబు,ఇరిగేషన్ ఏఈ రామలక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రాహ్మణి ముత్యాలమ్మ పండగ


శ్రీ బ్రాహ్మణి ముత్యాలమ్మను దర్శించుకున్న గ్రామ పెద్దలు

పరవాడ: మండల కేంద్రమైన పరవాడ గ్రామంలో కొలువుదీరిన బ్రాహ్మణి ముత్యాలమ్మ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు. ఉత్సవ కమిటీ భక్తులకు ఇబ్బంది లేకుండా షామియానాలు, తాగునీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. రాత్రికి అమ్మవారిని డప్పు వాయిద్యాలు, నేలడ్యాన్సులు, చిడతలు, తప్పెటగుళ్లు, సాముగరిడీలతో పుర వీధుల్లో ఊరేగించారు. రాత్రికి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భారీ బాణ సంచాకాల్పులతో అమ్మవారి అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న నాయకులు

ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు తో పాటు మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధి పైల రామచంద్రరావు, తదితరులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

సమయపాలన తప్పనిసరి

యూపీహెచ్‌సీ వైద్య సిబ్బందితో డీఎంహెచ్‌వో


శివనగర్ ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది అందరూ సమయపాలన తప్పనిసరిగా పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. మద్రిపాలెం శివనగర్ ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు మాట్లాడుతూ అన్ని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బర్త్ ప్లానింగ్ గురించి, హైరిస్క్ గర్భిణులను గుర్తించి డాక్టర్ల సలహా నిమిత్తం ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేటట్లు ప్రోత్సహించాలన్నారు. సాధారణ ప్రసవాలు అయ్యేలా ప్రోత్సహించాలని, శస్త్రచికిత్స ప్రసవాలను తగ్గించాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది అందరూ డ్రెస్ కోడ్ పాటించాలని పలు సూచనలిచ్చారు. యూపీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హరిద్వార్‌లో 'అన్నమాచార్య ట్రస్ట్' ప్రదర్శనలు


సంకీర్తనలు ఆలపిస్తున్న అన్నమాచార్య సేవా ట్రస్ట్ బృందం


కోలాటమాడుతున్న ట్రస్టు సభ్యులు

సీతంపేట: గంగా పుష్కరాల సందర్భంగా హరిద్వార్‌లో కేంద్ర ప్రభుత్వం, రేఖాన్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా నిర్వహించిన కార్నివాల్ ఆఫ్ ఇండియన్ కల్చర్ కార్యక్రమంలో నగరానికి చెందిన శ్రీవెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ వారి బృందం అన్నమాచార్య సంకీర్తనలు, కూచిపూడి నృత్యం, కోలాటం ప్రదర్శించారు. సేవా, సాంస్కృతిక ప్రదర్శనల్లో ఆద్యంతం బృంద సభ్యులు ఆకట్టుకున్నారని రేఖాన్ ఇంటర్నేషనల్ చైర్మన్ కలువ చంద్రశేఖరరావు ప్రశంసించారు. వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ సునీత కొటారి, టీం లీడర్ పద్మజావల్లి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పద్యాలాపన, నృత్యాలతో ఆకట్టుకున్న హంస అకాడమీ విద్యార్థులు



పద్యాలు ఆలపిస్తున్న చిన్నారులు, నృత్యం చేస్తున్న హంస అకాడమీ విద్యార్థులు

తాటిచెట్లపాలెం: సాలగ్రామపురంలోని పోర్టు సాగరమాల కన్వెన్షన్ హాల్‌లో గురువారం హంస అకాడమీ ఆఫ్ మ్యూజిక్, స్క్రిప్చర్ అండ్ ఆర్ట్స్ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. నరసింహ జయంతి, త్యాగరాజ జయంతి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేడుకలను ముఖ్య అతిథి విశాఖపట్నం పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే ప్రారంభించి మాట్లాడారు. చిన్నారులు విద్యతో పాటు ఇటువంటి పలు ప్రత్యేక అంశాల్లో కూడా నిష్ణాతులు కావాలని సూచించారు. హంస అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ రామ్‌ప్రసాద్ రచించిన థీమ్ సాంగ్ చిన్నారి చిలుకలము ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంగీత విద్వాంసురాలు మండ సుధారాణి ఈ పాటకు శ్రావ్యమైన సంగీతం సమకూర్చారు. సాయంత్రం జరిగిన కార్యక్రమాలను మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ నాయకుడు చెరువు రామకోటయ్యలు ప్రారంభించారు.

ఏకధాటిగా 80 పద్యాల ఆలాపన

ఐదేళ్ల నుంచి 22 ఏళ్ల వయసు గల సుమారు 50 మంది విద్యార్థులు పోతన భాగవతంలోని ప్రహ్లాద చరితము నుంచి 80 పద్యాలను ఏకధాటిగా వినిపించారు. ఆరుగురు చిన్నారులు అత్యంత సంక్లిష్టమైన నృసింహ గద్య పఠనం చేశారు. నృసింహ జయంతి సందర్భంగా సింహాచలం దేవస్థానం అర్చకుడు నృసింహ స్వామిజీ పూజలు జరిపారు. అనంతరం త్యాగరాజ సంస్మరణ కార్యక్రమంలో భాగంగా సుమారు 40 మంది చిన్నారులు త్యాగరాజ కృతులపై అంత్యాక్షరి నవల నిర్వహించారు. సంస్థ కార్యదర్శి ఎస్ఎల్ఎన్ శాస్త్రి నివేదికను సమర్పించారు. వివిధ సంస్థల్లో నృత్యం నేర్చుకుంటున్న బాలికల బృందాలు ఉత్తుకాడ్ వెంకట సుబ్బయ్య పాటలను ప్రదర్శించాయి. ఈ సందర్భంగా వీపీఏ డిప్యూటీ చైర్మన్‌ను సంస్థ అధ్యక్షులు ఘనంగా సత్కరించారు.

నృసింహవతారంలో బల్లిగిరి వెంకన్న


నృసింహావతారంలో బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: గురువారం నృసింహ జయంతి సందర్భంగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి నృసింహావతారంలో దర్శనమిచ్చారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జాము నుంచి బారులు తీరారు. నృసింహ జయంతి పురస్కరించుకుని ఆలయానికి భక్తులు తాకిడి పెరిగింది. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు, సహస్రనామాభిషేకాలు చేపట్టారు. స్వామి వారికి మామిడి పండ్లను నివేదించారు.

నేడు చక్రస్నానం

కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం బల్లిగిరి దేవాలయం ఆవరణలో చక్రతీర్థం, వసంతోత్సవం , పూర్ణాహుతి, తిరుమంజన సేవ, అష్టోత్తర శత కలశస్నపనం, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రఘునాథాచార్యులు తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


లక్ష్మణరావు మృతదేహం

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డులో గురువారం రాత్రి ఓ వ్యక్తి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆవ్యక్తిని ఎవరో తలపై కొట్టి చంపారని స్థానికులు అనుమానిస్తుండగా.. వాహనం ఢీ కొట్టడం వల్లే ఆ వ్యక్తి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.దీనిపై మల్కాపురం సీఐ లూథర్‌బాబు తెలిపిన వివరాలు ..జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రకాష్‌నగర్‌లో కోన లక్ష్మణ్ (41) భార్యా పిల్లలతో కలిసి నివాసం ఉండేవాడు. అయితే ఇటీవల భార్యాభర్తలు గొడవ పడడంతో పిల్లలను అత్త ఇంటి వద్ద వదిలి లక్ష్మణ్ భార్య పుట్టింటికి వెళ్లింది. ఇది ఇలా ఉండగా లక్ష్మణ్ గురువారం రాత్రి 8 గంటల సమయంలో పూటుగా మద్యం సేవించి ఆర్‌కేపురం సెయింట్ జోసెఫ్ పాఠశాల మార్గంలో ప్రకాష్‌నగర్‌లోని తన ఇంటికి వెళ్తున్నాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వాహనం లక్ష్మణ్‌ను ఢీ కొట్టి తలపై నుంచి వెళ్లడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు చెబుతున్నారు. కాగా స్థానిక వాసులు మాత్రం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పూర్తి విచారణ చేపడుతున్నమని సీఐ లూథర్‌బాబు తెలిపారు.శవ పంచానామా నిమిత్తం మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ చెప్పారు.

కార్మికుల సంక్షేమాన్ని ఆలోచించాలి

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కార్మిక సంక్షేమానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక సంక్షేమంపై కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 812వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన టీపీపీ, ఆర్ఈడీ, పీఈఎం స్టోర్స్, ఎస్ఎండీ విభాగ కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడితే, దాని ఫలితంగా మౌలిక సదుపాయాల కల్పనలన్నీ ఆ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోతాయన్నారు. దీంతో ప్రజలపై భారాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వరంగ సంస్థలను అభివృద్ధి చేసి, వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలను దండుకుని ప్రజలను అణచివేస్తారని విమర్శించారు. అందుకే విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్రప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- వాలిమెరకలో నూతన సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు ప్రారంభం

సింహాచలం: పార్టీలు, కులమతాలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పెందుర్తి మండలం వాలిమెరక పంచాయతీలో రూ.62.15లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనం, రూ.21.80లక్షలతో నిర్మించిన నూతన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పేద, బడుగు బలహీనవర్గాలు అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సంకల్ప యాత్ర సమయంలో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనని తెలిపారు.

సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లు

సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సీఎం జగన్ సమాన ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రతీ గ్రామంలో ప్రజలకు కావాల్సిన అన్ని సేవలు గ్రామస్థాయిలోనే అందించి నూతన శకానికి నాంది పలికారన్నారు. గ్రామ సచివాలయాల నిర్మాణం, రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, వెల్‌నెస్ సెంటర్లతో అనేక రకాల సేవలు గ్రామాల పరిధిలోనే అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. నాడు–నేడు ద్వారా వాలిమెరకలో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. జలజీవన్‌మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగకుండా సంక్షేమ ఫలాలు వస్తున్నాయని, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తామని ప్రతీచోటా ప్రజలు చెప్పడం సంతోషంగా ఉందన్నారు. వాలిమెరక సర్పంచ్ చంద్రవాణి మాట్లాడుతూ నూతన సచివాలయ భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తీసుకొన్న చొరవ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, ఎంపీడీవో వెంకటరావు, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, ఎంపీటీసీ స్వప్న, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు బైలపూడి భగవాన్‌జయరామ్, పెందుర్తి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నక్క కనకరాజు, పార్టీ నాయకులు బీఎస్ రాజు, కె.త్రినాథ్, నాగార్జున, మాధవరావు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేసి విశేషంగా హారతులు అందజేశారు. అర్చకుడు చిన్నా తదితరులు ఈపూజను నిర్వహించారు. ఆలయ ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

శివాజీ సేవలు స్ఫూర్తిదాయకం


రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

విశాఖ విద్య: కరోనా సమయంలో మృతి చెందిన ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా బాధ్యులు ఏవీఎస్ శివాజీ రెండో వర్ధంతిని ఎస్టీయూ సంఘం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని రామ్‌నగర్ లయన్స్ క్లబ్ భవనం నందు ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి ఉపాధ్యాయులంతా పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శివాజీ జ్ఞాపకార్థం ఉపాధ్యాయులు రక్తధానం చేశారు.

ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇమంది పైడిరాజు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా బాధ్యుడిగా, డీసీఈబీ సెక్రటరీగా పనిచేసిన శివాజీ విద్యారంగం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మంచి మిత్రుడు, విధుల పట్ల అంకితభావంతో పనిచేసిన శివాజీ కరోనా బారిన పడి అందరికీ దూరం కావటం ఎంతో బాధాకరమన్నారు. శివాజీను స్మరించుకునేలా సేవా కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా డీసీఈబీ సెక్రటరీ ఎంవీ. కృష్ణ కుమార్, ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆర్. సన్యాసిరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీ. దేముడుబాబు, రామిరెడ్డి, కోశాధికారి శ్రీధర్, సోమేశ్వరరావు, భాస్కర్, స్వామి నాయుడు, రామచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసి పూజ


సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవా, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో 44 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు బోదిలపాటి సత్య రూపవాణి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, వి. మారుతీప్రసాద్, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.